ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 18 జనవరి 2025



దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6 మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5నుంచి 8వ తరగతిలో, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హతగల మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థుల దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టీజీఎమ్ఆర్ఇఎస్ ఆన్ లైన్ వెబ్ సైట్ https://tgmreistelangana.cgg.gov.in/ మొబైల్ యాప్ ద్వారా ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి


ప్రమాణం చేయిస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ జాడి నర్సింహులు సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ వ్యాన్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గత ఏడాదిలో నాలుగు లక్షల ప్రమాదాలు జరగగా, అందులో లక్షా73 వేల పైచిలుకు మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ శాతం యువతే ఉన్నారని, చిన్నచిన్న తప్పిదల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈప్రభావం దేశ ఆర్థిక ప్రగతిరి నష్టం కలిగిస్తుందన్నారు. డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో రోడ్డుపై ఉన్న చిహ్నాలను గురించి అవగాహన కలిగి జాగ్రత్తగా గమనిస్తూ వాహనాల నడపాలని, వాహనాలను రహదారిపై ఆపినప్పుడు పూర్తిగా రోడ్డు దింపి ఆపాలని సూచించారు. రాత్రివేళలో ప్రయాణం చేసినప్పుడు, పార్కింగ్ చేసినప్పుడు ఆ మార్గంలో ప్రయాణం చేసే ఇతర వాహనాలకు వాహనం కనిపించే విధంగా వ్యాన్ ఇరుపక్కల వెనుక భాగంలో కూడా రేడియం స్టిక్కర్ను అంటించాలని, వాహనం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఆగిపోయినట్లయితే వాహనం చుట్టూ జాగ్రత్తలు పాటిస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సూచికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్ఐ సహదేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు.. కొత్త రేషన్‌కార్డులు



- కులగణన సర్వే ఆధారంగా మంజూరు
- కొనసాగుతున్న అర్హుల గుర్తింపు సర్వే

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారి కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వ పథకాలన్నీ రేషన్ కార్డులతోనే ముడిపడి ఉండడంతో కార్డు లు లేక చాలా మంది సబ్సిడీ పథకాలకు దూర మయ్యారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్న నేపథ్యంలో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించారు.

చివరిసారిగా రేషన్ కార్డులను గత ప్రభుత్వ హయాంలో 2021లో జారీ చేశారు. ఆ తర్వాత మళ్లీ కార్డులు జారీ చేయలేదు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ డిసెంబరు 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించిన గ్రామ, వార్డు సభల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. కానీ కార్డులను జారీ చేయలేదు. ఇప్పుడు, అప్పుడు అంటూ ఏడాది గడిపారు.

ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, 500 రూపాయలకే వంట గ్యాస్, తదితర పథకాలకు నోచుకోలేదు. రేషన్‌కార్డుల జారీ చేసేందుకు విధివిధానాలను రూపొందించేందుకు నియమించిన మంత్రివర్గ ఉప సంఘం గతంలో ఉన్న మార్గదర్శకాల్లో ఎలాంటి మార్పులు లేకుండా కార్డులను జారీ చేయాలని ఈనెల 4వ తేదీన ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఈనెల 26వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు.

జిల్లాలో 15,255 కుటుంబాల గుర్తింపు..

గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో నిర్వహించిన కులగణన సర్వేలో భాగంగా రేషన్ కార్డులు లేని కుటుంబాలను గుర్తించారు. జిల్లాలో 15,255 కుటుంబాలకు రేషన్ కార్డులు లేవని తేలింది. ఇందుకు సంబంధించిన

మిగతా 8వ పేజీలో..

మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కార్డులు లేని కుటుంబాలు..

రామగుండం	- 3179
పెద్దపల్లి	- 884
సుల్తానాబాద్	- 404
మంథని	- 319

మండలాల వారీగా కార్డులు లేని కుటుంబాలు..

పెద్దపల్లి	- 1348
ధర్మారం	- 1177
సుల్తానాబాద్	- 1049
ఓదెల	- 887
కాల్వశ్రీరాంపూర్	- 883
రామగిరి	- 880
మంథని	- 870
జూలపల్లి	- 678
పాలకుర్తి	- 607
ముత్తారం	- 546
కమాన్‌పూర్	- 543
అంతర్గాం	- 518
ఎలిగేడు	- 483

న్యూస్ బాక్స్

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో సంకట హర చతుర్థి వేడుకలను భక్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన ఉత్సవాలు

ఎలిగేడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలపల్లిలో శ్రీమల్లికార్జున స్వామి ఉత్సవాలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వారం క్రితం మొదలైన ఉత్సవాల్లో శుక్రవారం లగ్నపట్నంతో ముగిశాయి. ఉత్సవాలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పర రాజేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు మామిడి ఢిల్లేశ్వర్‌రెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, కొమటిరెడ్డి బుచ్చిహన్మంతరెడ్డి, చిగుర్ల రాములు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడద నివారించండి

కోల్‌సిటీటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్ పరిధిలో వీధి విధిలో కుక్కలు, కోతుల బెడద నివారించాలని బీఆర్ఎస్ నాయకుడు ఈదునూరి నర్సింగ్ కమిషనర్ అరుణశ్రీని కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గల్లీలలో వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేయడం వల్ల చిన్నపిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయభ్రాంతులకు లోనవుతున్నారన్నారు. కుక్కల బెడదపై పలుమార్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చర్యలు తీసుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల సౌకర్యార్థం గ్రేటర్ హైదరాబాద్ తరహాలో ఇక్కడి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా విధి కుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ నంబర్‌ను కేటాయించాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక కర్ష, ఐక్యత దినోత్సవం పోస్టర్‌ను శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడారు. ఈనెల 19 కార్మిక కర్షక దినోత్సవం, జనవరి 26న ట్రాక్టర్, మోటార్‌సైకిల్ పరేడ్ నిర్వహించాలని, ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా జరిగే నిరసనలను జిల్లాలో జయప్రదంగా చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంద రాజేందర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, నాయకులు సావణపెల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలి

-రామగుండం సీపీ శ్రీనివాస్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రత ప్రమాణాలు పాటించాలని, ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటుచేసుకోవాలని రామగుండం సీపీఎం శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ వ్యాప్తంగా ఉన్న ఏసీపీలు, వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79ఏటీఎంలు, మంచిర్యాల జోన్ పరిధిలో 109బ్యాంకులు, 89ఏటీఎం సెంటర్లు ఉన్నాయని, బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఖచ్చితంగా నియమించాలని, బ్యాంకు అధికారులు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో నాణ్యత లోపం ఉందని, హై ఫ్రీక్వెన్సీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు అలారం సిస్టం కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దోపిడీ సమయంలో సిబ్బంది ఎలా ప్రతిస్పందించాలి, దానిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. బ్యాంకు లోపలికి వచ్చే వ్యక్తులను తనిఖీ చేయడానికి డ్యూటీలో ఒక గార్డుతో పాటు ప్రవేశం ద్వారం వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్‌డిటెక్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెక్యూరిటీ గార్డ్‌ను బ్యాంకు లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ అతడి వ్యక్తిగత సమాచారం, పూర్తి బయోడేటా ఉండాలన్నారు. కొత్తగా నియమితులైనవారు, తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన వారితో బ్యాంకు అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చాలా నేరాల్లో నిందితులు సీసీ కెమెరాలపై స్ప్రే చేసి సీసీ కెమెరాలు పని చేయకుండా చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని, అంతేకాకుండా డీవీఆర్‌లను కూడా దొంగిలించుకువెళ్లి వాటిని ధ్వంసం చేస్తున్నారని, డీవీఆర్‌లను రహస్య ప్రదేశంలో ఉంచాలని, ఆయుధాల ఉపయోగంపై సెక్యూరిటీ గార్డులకు శిక్షణ ఇవ్వాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఏటీఎంలో డబ్బులు ఫిల్లింగ్ చేసే సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారన్నారు. ప్రతి బ్యాంకులో పోలీస్ స్టేషన్లు, హెల్ప్‌లైన్ నంబర్లు పెద్ద అక్షరాలతో ప్రదర్శించాలని, దొంగలు ఎక్కువగా బ్యాంకులను తెరిచినప్పుడు లేదా మూసివేసే సమయంలో, భోజన విరామసమయంలో లక్ష్యం చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీలు మడత రమేష్, గజ్జి కృష్ణ, ఆరె వెంకటేశ్వర్లు, ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే చర్యలు

ఎలాంటి కేసులు లేవని కొంతమంది తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నారని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లో పాస్‌పోర్టు కోసం, ఉద్యోగ నియామకాల కోసం, విదేశాలకు వెళ్లడం కోసం, ఇతర కంపెనీలు, సంస్థలు, పరిశ్రమల్లో పని చేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్(పీవీసీ), పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో కొంత మందిపై కేసులు ఉన్నా లేవని తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తున్నారన్నారు. గతంలో కూడా తప్పుడు అఫిడవిట్లు ఇచ్చిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని, ప్రస్తుతం 20మంది తప్పుడు అఫిడవిట్లు ఇచ్చి సమర్పించారని, వారిపై విచారణ జరిపి చట్టపరంగా కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. తప్పుడు అఫిడవిట్లు ఇస్తే నోటరీ చేసేవారిపై కూడా కేసు చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ఎన్జీవోల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఉద్యోగులు

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎన్జీవోల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి జిల్లా అభివృద్ధిలో ముందుండాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్షను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షులు రమేష్, ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, సౌమ్య, సుమలత, సురేందర్, సంపత్, శివ, హర్మిందర్, రాజయ్య మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల హక్కుల సాధనకు ఐక్యంగా కృషి

పెద్దపల్లిటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ఎరుకల హక్కుల కోసం ప్రతి ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం ఎరుకల ప్రజా సమితి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి కిష్టయ్య ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నివసిస్తున్న ఎరుకల ప్రజలు దాదాపు 90 శాతం పందులపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి పందులు పెంచుకునే ప్రతి కుటుంబానికి 10గుంటల స్థలం కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఏకలవ్య కమిటీ హాల్ కోసం ఐదు గంటల స్థలం కేటాయించాలని, జిల్లా కేంద్రంలో కూడా 10గుంటల స్థలం కేటాయించాలని కోరారు. యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రేవెల్లి తిరుపతి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్య క్షుడు దాసరి కిష్టయ్య, జిల్లా అధ్యక్షుడు, మానుపాటి రవి, ప్రధాన కార్యదర్శి అలెపు సది, జిల్లా ఉపాధ్యక్షుడు రేవెల్లి శ్రీనివాస్, అల్లెపు ఆంజనేయులు కుర్ర ఆకాష్ సార్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పోస్టులకు ఉచితశిక్షణకు అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి డీబీసీడీవో జె.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు వెబ్‌సైట్ http://tgbcstudycircles.cgg.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కరీంనగర్‌లో ఉంటుందని వివరాలకు ఫోన్ నంబర్ 0878 2268686లో, బీసీ స్టడీ సర్కిల్, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కలెక్టర్


సమీక్షా సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయాల నిర్వహణ సరిగ్గా లేవని, టాయిలెట్స్ మెయింటనెన్స్ మరింత మెరుగ్గా ఉండాలన్నారు. కార్యాలయాలో విధులు నిర్వహించే సిబ్బంది డైనింగ్ హాల్ వద్ద లంచ్ చేయాలని, ఆ డైనింగ్ హాల్‌ను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయ రికార్డులు సరిగ్గా భద్రపరచాలని, ఎక్కడ పడితే అక్కడ వేయద్దని సూచించారు. కార్యాలయంలో అనవసరమైన రికార్డులు, చాలా పాతకాలంనాటి ఫర్నిచర్‌ను తొలగించాలని, పాడైపోయిన బీరువాలు అధికంగా ఉండటం వల్ల ఎక్కువ స్థలం వాటికే సరిపోతుందని, వాటి స్థానంలో నూతన ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని సూచించారు. నాలుగు రోజులలో కార్యాలయంలోని స్టాఫ్ వినియోగించుకుని ప్రతి కార్యాలయం శుభ్రం చేసుకోవాలని, ఒక ఫైల్స్ వెంటనే తీసేలా సర్దుకోవాలని, ప్రతి ఫ్లోర్ వద్ద అదనంగా మరో మూడు పైప్‌లైన్ ఔట్‌లెట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పాత పాడైపోయిన ప్రస్తుతం ఉపయోగంలో లేని ప్రింటర్లు, సామాన్లను డిస్పోస్ చేయాలన్నారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యాలయ డ్యూటీ సమయంలో క్షేత్రస్థాయి తనిఖీలకు వెళితే రికార్డుల్లో ఆ వివరాలు నమోదు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు వేణు, అరుణశ్రీ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో డాక్టర్‌ను నియమించని ప్రభుత్వం..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు, చిన్న పిల్లలకు అత్యవసర వైద్యసేవలు అందించే స్థానిక మాతా శిశువు సంరక్షణ కేంద్రంలో 2 నెలలుగా డాక్టర్‌ను నియమించని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. స్థానిక ఎంసీహెచ్‌ను పుట్ట మధు శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల కాన్పు తల్లిదండ్రులకు భారం కాకూడదనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్ప ఆలోచనతో మాతా శిశు ఆసుపత్రిని నిర్మించి మెరుగైన వైద్య సేవలందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆసుపత్రిపై మంత్రి నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. నిత్యం సీఎంతో కలిసి తిరుగుతున్న మంథని ఎమ్మెల్యే తన సొంత నియోజకవర్గకేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రిలో ఒక డాక్టర్‌ను నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. మంథని ప్రజల ఓట్లతో గెలిచి మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే వారి కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. రెండునెలలుగా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ డాక్టర్‌ను నియమించడంలో విఫలమయ్యారన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ నియామకం,నిర్వాహణపై మంత్రి స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉండగా ఆసుపత్రి నిర్వాహణపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, తరచూ సందర్శించామన్నారు. ఇప్పుడు ఆసుపత్రిని గాలికి వదిలివేశారన్నారు. దీంతో ప్రసూతి కోసం గర్భిణులు, వైద్య సేవల కోసం బాలింతలు, శిశువులు గోదావరిఖని, కరీంనగర్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఈవిషయంలో కలెక్టర్ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఆసుపత్రిలో డాక్టర్‌ను నియమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, కాయితి సమ్మయ్య, వంశీ, ఆసీఫ్, ఇర్ఫాన్, కుమార్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

కుంట కట్టకు బుంగ


మడికట్లలో ఇసుక మేటలు

ఓదెల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఓదెల మండల కేంద్రంలోని గొల్లపోచాలుకుంట కట్టకు బుంగ పడింది. దీంతో వరినాట్లు వేసుకోవడానికి సిద్ధం చేసిన మడికట్లలో ఇసుక మేటలు నిండిపోయి రైతులను తీవ్ర నష్టాని గురిచేసింది. డీ86 ప్రధాన కాల్వ నుంచి ఉపకాల్వకు నీరు అధికంగా వెళుతున్నప్పటికీ అధికారులకు లష్కర్లు సరైన సమాచారం ఇవ్వలేదు. దీంతో ఉపకాల్వల్లోకి నీటి ప్రవాహం పెరిగి గొల్లపోచాలు కుంటలోకి సామర్థ్యం కంటే ఎక్కువ నీరు చేరడంతో కట్టకు బుంగ పడింది. దీంతో కుంట ఆయకట్టు కింద ఉన్న దాదాపు 40 ఎకరాల మేరకు మడి కట్లల్లోకి నీరు అధికంగా ప్రవహించింది. పది ఎకరాల్లోని మడికట్లల్లో ఇసుక మేటలు నిండుకున్నాయి. మరో రెండు రోజుల్లో వరినాట్లు వేద్దామనుకున్న రైతులకు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఉపకాల్వలను పరిశీలించి సామర్థ్యం కంటే ఎక్కువ నీటి సరఫరాను తగ్గించాలని రైతులు కోరుతున్నారు.


అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

అభివృద్ధి పనులు జరిగేదెలా..?

- అలంకారప్రాయంగా పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం

8



సిమ్స్ కళాశాల ముఖ ద్వారం

అనుమతిపై ఉత్కంఠ

- సిమ్స్ కళాశాలలో పీజీ కోర్సుల కోసం ఎదురుచూపులు

6

నిమ్మకాయ తెచ్చిన తంటా

● ఇరువర్గాల మధ్య ఘర్షణ ● 16మందిపై కేసు నమోదు

మల్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం అనంతరం దిగువ కొండగట్టులో వన భోజనాలలో భాగంగా విందు చేసుకుంటున్న రెండు వర్గాల మధ్య నిమ్మకాయ విషయంలో జరిగిన గొడవలో 16మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వేములవాడకు చెందిన ఈర్లపల్లి గౌతమి కుటుంబసభ్యులు, జమ్మి కుంటకు చెందిన పల్లపు మధూకర్ మరికొందరు వేర్వేరుగా శుక్రవారం కొండగుట్టు ఆంజనేయ స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం దిగువ కొండగట్టులో చెట్ల కింద పక్కపక్కనే విందు భోజనాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక వర్గానికి చెందిన వారు భోజనం చేస్తూ పక్కన గల మరోవర్గం వారిని నిమ్మకాయ అడిగారు. అయితే నిమ్మకాయలు తక్కువ ఉన్నాయని, తమకు సరిపోవని చెప్పే క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ దాడులకు దారి తీసింది. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

చికిత్స పొందుతూ మహిళ మృతి

చొప్పదండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపల్లి సూరవ్వ(55) అనే మహిళ శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. సూరవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సూరవ్వ శుక్రవారం మృతి చెందింది. సూరవ్వ కుమారుడు నాంపల్లి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దపల్లి మండలంలో వృద్ధుడు..

పెద్దపల్లి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుగొండ గ్రామ పంచాయతీ అనుబంధ జగన్నాథపురం గ్రామానికి చెందిన బుర్ర ఎల్లయ్య(70) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మల్లయ్య వృత్తిరీత్యా గీత కార్మికుడని, కొన్ని రోజుల క్రితం చెట్టుపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో ఇంటికే పరిమితమైన మల్లయ్య జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఫ్రిడ్జి

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుతినగర్‌లోని ఓ ఇంట్లో అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, సామగ్రి కాలిబూడిదయ్యాయి. మారుతినగర్‌లో గూడ ఉలియమ్మ, ఓదెలు దంపతులు నివసిస్తున్న ఇంట్లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో అతికష్టం మీద వృద్ధ దంపతులు బయటకు వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. అప్పటికే పొగ పీల్చిన వలియమ్మ స్పృహతప్పి పడిపోయింది. మంటలకు ఇంట్లోని ఫ్రిడ్జి, టీవీ ఇతర సామగ్రి కాలిపోయాయి. సమీప ప్రాంత ప్రజలు వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ ప్రమా దంలో దాదాపు రెండు లక్షల నష్టం జరిగిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఓదెల దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ కర్రె కుమారస్వామి అధికారులను కోరారు.

● సిమ్స్ కళాశాలలో పీజీ కోర్సుల కోసం ఎదురుచూపులు

● జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు అధికారుల దరఖాస్తు



కళ్యాణ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో బోధన తరగతులు ప్రారంభమై మూడు సంవత్సరాలు కావస్తుంది. ఈ ఏడాది కళాశాలలో పీజీ కోర్సులకు దరఖాస్తు చేశారు. ఆరు విభాగాల కోర్సులకు జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. పీజీ కౌన్సిలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఆరు విభాగాల్లో 24సీట్లు మంజూరవుతాయని భావించినా ఇప్పటి వరకు దీనిపై స్పష్టత రాలేదు. జాతీయ వైద్య విద్యా కమిషన్ మెడికల్ కళాశాలను సందర్శించిన అనంతరం ఇక్కడి వసతులను బట్టి పీజీ కోర్సులకు అనుమతులు ఇవ్వనున్నారు. ఈ సీట్ల కోసం ప్రభుత్వం తరపున సుమారు రూ.96లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పీజీ కోర్సులపై నివేదికను కూడా పంపారు. డీఎంఈ కార్యాలయం నుంచి నివేదిక కూడా పంపారు. ప్రభుత్వం తరఫున పీజీ కోర్సులకు డిపాజిట్ చేయడానికి కూడా సుముఖతతో ఉంది.

● ఆరు పీజీ కోర్సులకు దరఖాస్తు..

ఎంబీబీఎస్ 4వ సంవత్సరం మొదలు కాగానే విద్యార్థులు పీజీ కోర్సుల కోసం పోటీ పడుతుంటారు. పీజీ కోర్సుల్లో ఫ్రీ సీటు వస్తే విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుతుంది. ఇందుకోసం గాను ఈ ఏడాది ఎమర్జెన్సీ మెడిసిన్, నాలుగు సీట్లు, ఆర్థో నాలుగు సీట్లు, గైనకాలజీ నాలుగు సీట్లు, పిడియాట్రిక్ నాలుగు సీట్లు, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ నాలుగు సీట్లు మొత్తం 24సీట్ల కోసం జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు దరఖాస్తు చేశారు. ఇందులో సీట్లు మంజూరైతే ఇక్కడ మరింత వైద్య విద్యార్థులకు ఉన్నత విద్య లభించనున్నది.

● 2022-23లో ప్రారంభం..

రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థ నిధుల నుంచి రూ.520కోట్లను కేటాయించారు. ఏడాదిలోపే భవన నిర్మాణాలను పూర్తిచేసి 2022-23లో వైద్య విద్యను ప్రారంభించారు. 150సీట్లతో మొదటి సంవ త్సరం బోధన తరగతులు ప్రారంభించారు. ఇందులో సింగరేణి కార్మికుల పిల్లల కోసం 7శాతం, జాతీయ కోటాలో 15శాతం, 128సీట్లు రాష్ట్ర కోటా నుంచి భర్తీ అయ్యాయి. రామగుండంలో నిర్మించిన మెడికల్ కళాశాలలో అన్ని వసతులు ఉండడంతో ఇక్కడ చేరడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది కూడా సింగరేణి మెడికల్ కళాశాలలో సీటు పొందడానికి విద్యార్థులు పోటీ పడ్డారు.

అనుమతుల కోసం వేచి చూస్తున్నాం..

- హిమబిందు, సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్



పీజీ కోర్సుల అనుమతి కోసం వేచి చూస్తున్నాం. గత ఏడాదిలోనే ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, ఆర్థో, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగాల పీజీ కోర్సుల కోసం నివేదిక పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే క్లాసులను ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. పీజీ కోర్సులు వస్తే ప్రతి అదనంగా సిమ్స్ కళాశాలలో ఏటా 24 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు పెరుగుతాయి.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



రంగారావు(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయో ధుడు రంగారావు(90) శుక్రవారం మృతి చెందారు. నైజాం, రజాకార్ల అరాచకాలను ఎండగట్టడంలో, స్వాతంత్ర్య సమర యోధులతో కలిసి పోరాటాలు చేయడంలో రంగారావు ముందుండేవారని గ్రామస్థులు తెలిపారు. రంగారావు మృతిపై పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సంతాపం తెలిపారు. సుద్దాల గ్రామంలోని రంగారావు నివాసాని కి వచ్చి ఆయన భౌతికకాయంపై జాతీయ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు తదితరులు నివాళులర్పించారు.

స్తంభానికి ఢీకొట్టిన కారు ఆర్‌ఎంపీ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని గాంధీనగర్ వద్ద కరీంనగర్-రాజన్నసిరిసిల్ల రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ ఓరుగంటి రాంచంద్రం(63) మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్న రాంచంద్రం శుక్రవారం ఉదయం బావుపేట నుంచి కరీంనగర్‌కు తన కారులో వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్థంభానికి ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడడంతో రాంచంద్రం అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

మెట్‌పల్లి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలతపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు శుక్రవారం గురుకులాల కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఓంకారి అఖిల్ 2024 డిసెంబర్ 18న పాము కాటుకు గురయ్యాడు. 19న మరో విద్యార్థి బోడ యశ్వంత్ అస్వస్థతకు గురయ్యాడు. 24గంటల వ్యవధిలోనే ఇద్దరు అస్వస్థత బారిన పడి ఘటన చర్యల్లో భాగంగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గురుకుల నిర్వహణలో ప్రిన్సిపాల్ మాధవీలత నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారుల విచారణలో తేలడంతో జిల్లా కలెక్టర్ డిసెంబర్ 19న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చే వరకు గురుకుల ఉపాధ్యాయుడైన షైపాల్‌రెడ్డికి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. గురుకులాల కార్యదర్శి విచారణ అనంతరం ప్రిన్సిపాల్‌పై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తూ యధావిధిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య (45), ఊరడి రవి (42)లు వ్యక్తి గత పనిపై బైక్‌పై మానకొండూర్‌కు వెళ్లారు. తిరిగి రాఘవాపూర్ వెళుతూ వెల్ది రోడ్డు పక్కన బైక్ నిలిపారు. ఆ సమయంలో అన్నారం నుంచి కరీంనగర్‌కు వెళుతున్న కారు ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఎల్లయ్య, రవికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారికి కరీంనగర్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తర లిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దారి దోపిడీ దొంగల పట్టివేత

» నిందితుల నుంచి నగదుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం

» వివరాలు వెల్లడించిన పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కూలి పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒకరిని అడ్డగించి దారి దోపిడి చేసిన ఇద్దరు దొంగలను సాంకేతిక పరిజ్ఞానంతో 10 గంటల లోపే జగిత్యాల పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘు చందర్ విలేకరుల సమావేశం నిర్వహించి నిందితులను అరెస్టు చూపించి పూర్తి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన దుర్గం సాయి బాబా అనే వ్యక్తి ఉపాధి కోసం జగిత్యాల జిల్లా కేంద్రానికి వలస వచ్చి గోవిందు పల్లిలో నివాసం ఉంటున్నాడు. గురువారం కూలీ పను లు ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి వెళుతున్నాడు. ఈ క్ర మంలో బైపాస్ రోడ్‌లో సాయిబాబాను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి అడ్డగించి దాడి చేసి రూ. 2,800 నగదుతో పాటు రూ. 3 వేల విలువగల సెల్ ఫోన్‌ను అప హరించుకు వెళ్లారు. బాధితుడు తేరుకుని టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దోపిడీకి పాల్పడిన నిందితులు ఇద్దరిని మంచినీళ్ల బావి ప్రాంతంలో శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. ఇద్దరు నిందితులు పట్టణంలోని పురాణీపేటకు చెందిన పోచంపెల్లి శంకర్, జగిత్యాల రూరల్ మండలం బాలెప ల్లికి చెందిన సిరికొండ నరేష్‌గా గుర్తించి వారి వద్ద స్కూటీతో పాటు దోపిడీ చేసిన నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వేణు గోపాల్, ఎస్సైలు మన్మధ రావు, గీత సిబ్బంది పాల్గొన్నారు.

● ద్విచక్ర వాహనాల చోరీ..

జగిత్యాలతో జిల్లా కేంద్రంలో ఇటీవల ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల స మా వేశం నిర్వహించి నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని చిన్న కెనాల్ సమీపంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నెంబరు ప్లేట్ లేని వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో పట్టణంలోని కృష్ణానగర్, కరీంనగర్ రోడ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో నిలిపి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్లుగా గుర్తించారు. నిందితుడిని జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన అమేర్‌గా గుర్తించి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాం డ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వేణు గోపాల్, ఎస్సైలు మన్మధరావు, గీత పా ల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇండేన్ డీలర్లు తమగ్యాస్ వాడకం దారులకు మెరుగైన సేవలు అందించాలని ఇండియన్ కార్పోరేషన్ తెలంగాణ, ఆంధ్రా (టాప్స్) విక్రయ విభాగం సీనియర్ అధికారి కెకీర్తి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ సేల్స్ ఏరియా-1 ఇండేన్ గ్యాస్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి చివరి నాటికి విధిగా సురక్ష రబ్బరు ట్యూబ్ మార్చుకునే విధంగా కస్టమర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎల్‌పీజీ డీలర్ అంబుజా గ్యాస్ ఏజన్సీ అధినేత పీవీ మదన్‌మోహన్, సుభాష్‌రావు, రాధాక్రిష్ణ, ప్రవీణ్, శ్రీధర్, రాజయ్య, అమరీష్, రాము, హన్మంత్‌పటేల్, వెంగళరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంపై దాడి కేసులో పలువురికి జైలు శిక్ష

కోనరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయంపై దాడి కేసులో నిందితులకు ప్రిన్సిపల్ జిల్లా సెషన్ జడ్జి ప్రేమలత జైలు శిక్ష విధించినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. నిమ్మపల్లికి చెందిన ఉప్పర కులస్తులు జవ్వాజి పూజ, జవ్వాజి విమల, చంద్రకళ, మేదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజ్యం రాజయ్య, గంగాధర్, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్ 19 మార్చి 2017 రోజున కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ నాగరాజమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. 2023 నవంబరులో కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా జిల్లా న్యాయమూర్తి అప్పీల్‌ను తిరస్కరించి ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పదోన్నతిపై మహ్మద్ రషీద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హుజూరాబాద్ డివిజన్‌లో సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు కరీంనగర్ ఏడీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డబుల్ రోడ్డు కోసం మహా పాదయాత్ర

గంభీరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామస్థులు డబుల్ రోడ్డు కోసం మరోసారి నడుం బిగించారు. గతంలో డబుల్ రోడ్డు కోసం ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టారు. తాజా మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శివాజీనగర్ గ్రామ సరిహద్దు వరకు నాలుగు కిలో మీటర్ల డబుల్ రోడ్డు కోసం శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. కొత్తపల్లి గ్రామంలో పాదయాత్ర ప్రారంభంలో గంగిరెద్దుకు వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. కొత్తపల్లి గ్రామం నుంచి గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయం వరకు దాదాపు 10 కిలో మీటర్ల వరకు మహా పాదయాత్ర కొనసాగింది. వెంటనే కొత్తపల్లిలో డబుల్ రోడ్డు మంజూరు చేయాలని, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి ఎల్లమ్మ నుంచి శివాజీనగర్ గ్రామ శివారు వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, బస్సులు పూర్తి స్థాయిలో నడవడం లేదని వాపోయారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే వాహనాలు రావడం లేదని, ఉన్నత చదవుల కోసం వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం తహ సీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శివసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌటే గణేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పర్శాగౌడ్, శ్రావణ్, రాజుగౌడ్, మహేష్, పోశెట్టి, అవినాష్, రఘు, సాగర్, రమేష్, ప్రవీణ్, వెంకటి, కిష్టయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వస్తున్న నాయకులు, ప్రజలు

అభివృద్ధి పనులు వేగవంతం

» రోడ్డు, వంతెనలు, ప్రాజెక్టులకు మోక్షం



కొనసాగుతున్న సూరమ్మ మత్తడి పనులు

కథలాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఖజానా నిండుకోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిపి వేసి చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు రెండేళ్ల అనంతరం పనుల కొనసాగిస్తున్నారు. కోట్లాది రూపాయల బిల్లులు రాక పని ప్రదేశాల వద్ద సామగ్రి వదిలి వెళ్లిన వారు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జోక్యం, హామీతో అర్ధంతరంగా నిలిపి వేసిన పనులను పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో కథలాపూర్ మండ లంలోని అనేక గ్రామాల్లో పనులు చకచకా సాగుతున్నాయి.

● ఆరేళ్ల క్రితం శంకుస్థాపన..

తక్కళ్లపల్లి - సిరికొండ వంతెనకు ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేయగా కాంట్రాక్టర్ 70 శాతం పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాల కిందట స్టీలు, కాంక్రీట్, సిమెంట్ ఇతరత్రా సామగ్రి వదిలేసి వెళ్లాడు. ఆర్అండ్‌బీ అధికారులు టెండర్ రద్దు చేయగా ఎమ్మెల్యే జోక్యంతో పునరుద్ధరించడంతో వంతెన పనులు జోరుగా సాగుతున్నాయి. అంబారిపేట వయా కొచ్చెగుట్ట తండా నుంచి రుద్రంగి దాకా బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ పథకం కింద రూ. 3 కోట్లు మం జూ రు కాగా టెండర్ వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రావనే భయంతో ముందుకు రాలేదు. ప్రస్తుతం ఆ పనులు ఊపందుకున్నాయి. అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి రెండేళ్ల కిందట 15వ ఆర్థిక సంఘం రూ. 1.56 కోట్లు మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఏడాదిగా నిలిపి వేశాడు. ఎట్టకేలకు కాంట్రాక్టర్‌ను ఒప్పించడంతో పనులు జరుగుతున్నాయి. సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ మత్తడి, కట్ట పనులు చందుర్తి మండలానికి చెందిన ఓ సబ్‌కాంట్రాక్టర్ మూడేళ్ల కిందట బిల్లుల సమస్యతో నిలిపి వేయగా కొత్త సబ్‌కాంట్రా క్టర్‌తో దాదాపు రూ.6 కోట్ల పనులను వేగవంతంగా చేపడుతున్నారు. రాళ్లవా గు ప్రాజెక్ట్ కుడి కాలువ తెగిపోగా మరమ్మ తులకుగాను కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక రూ. 21 లక్షలు కేటాయించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు పూర్తి చేయించడంలో సఫలమయ్యారు.

● బీటీ రోడ్ల టెండర్లు..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దూలూరు నుంచి పోసానిపేటకు రూ. 3 కోట్లు, చింతకుంట - కథలాపూర్ బీటీ రోడ్డుకు రూ. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి కథలాపూర్‌కు రూ. 6 కోట్లతో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కాగా టెండర్లు కూడా జరి గాయి. ఈ పనులకు శంకుస్థాపన కూడా చేసినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముం దుకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక టెండర్లు రద్దు కాగా ఆ కాంట్రాక్టర్లతోనే పను లు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కోరడంతో టెండర్లు పునరుద్ధరించుకున్నట్టు తెలిసింది.



అంబారిపేట తండాలో రోడ్డు రోలర్‌తో చదును చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే కృషితో పనుల్లో కదలిక

- జవ్వాజి రవి, అంబారిపేట



రెండేళ్లుగా నిలిచిపోయిన పనుల్లో ఎమ్మెల్యే క దలిక తీసుకు రావడం శుభపరిణా మం. పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతా యి. అధికారులు త్వరగా పూర్తి చేసేం దుకు చర్యలు తీసుకోవాలి.

● ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు


వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి శ్రీ రామలిం గేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శుక్రవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూ పరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకులు బొజ్జ సంతోష్‌కుమార్, ద్యా వళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

● 'నాగోబా'కు కమ్మునూర్ గోదావరి జలాలు

బీర్పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మునూర్ కలమడుగు బ్రిడ్జి సమీపంలోగల గోదావరి నది ప్రాంతంలో మెస్రం వంశీయులు శుక్రవారం గోదావరి జలాన్ని ప్రత్యేకమైన ఝరిలో సేకరించి నాగోబా జాతరకు బయలు దేరారు. మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న నాగోబా దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ నెల 28న మహాపూజతో నాగోబా జాతర బ్రహ్మోత్స వాలు ప్రారంభం కానున్నాయి. మెస్రం వంశీయులు పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయులు శుక్రవారం ఉదయం కలమడుగు గోదావరి రేవులోని అత్తమడుగు ప్రాంతానికి చేరుకొని గంగాజలాలు సేకరించారు. కాలినడకన పాదయాత్రగా కేస్లాపూర్‌కు పయనమయ్యారు.


కాళినడకన బయలుదేరిన మెస్రం వంశీయులు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు


విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కరీంనగర్ టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోగల టీజీఎన్‌పీ డీసీఎల్ సమావేశ మందిరంలో కరీంనగర్ సర్కిల్ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఎస్ఏవో, ఏవోలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమే శ్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. వేసవి కాలంలో తీసుకో వాల్సిన జాగ్రతలపై పలు సూచనలు చేశా రు. అగ్రికల్చర్ సర్వీసెస్ తొందరగా రిలీజ్ చేయాలన్నారు. ఇంటర్ లింకింగ్ లైన్ ్స ఆర్ఎం అతిత్వరలో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. సంబంధిత సిబ్బందికి తగిన శిక్షణ తరగతులను కూడా నిర్వహించి తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. వర్క్ ఆర్డర్లు తొందరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, రాజాం, తిరుపతి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, రమణారెడ్డి, ఏడీలు, శ్రీనివాస్ లావణ్య, నరేందర్, కిరణ్, ఏఈలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

● వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

వచ్చే వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు ముం దస్తు చర్యలు చేపట్టారు. నాణ్యమైన నిరం తర విద్యుత్ సరఫరా చేసేందుకు కరీంనగర్ టౌన్ వన్ సెక్షన్‌లో మూడు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, టౌన్ 3 సెక్షన్‌లో ఒక 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛార్జ్ చేశారు. కార్య క్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ మేక రమేష్ బాబు, డివిజనల్ ఇంజనీర్ జంపాల రాజం, ఏడీఈ టౌన్‌వన్ పంజాల శ్రీనివాస్‌గౌడ్, టౌన్ వన్, టౌన్ టు, ఏఈలు పాల్గొన్నారు.

నారసింహా.. నదీస్నానం గగనమేనా..


ధర్మపురి గోదావరి వద్ద పేరుక పోయిన చెత్తా చెదారం

- ● దుర్గంధంగా మారిన గోదావరి నది
- ● నదిలో కలుస్తున్న మురికి కాలువ నీరు
- ● పరిశుభ్రత లోపం-భక్తుల ఇక్కట్లు

ధర్మపురి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద పరిశుభ్రత లోపించింది. దీంతో నిత్యం దూర ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దక్షిణ దిశగా ప్రవహిస్తున్న ధర్మపురి గోదావరి నదికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ నదిలో స్నానాలు ఆచరించడం కోసం నిత్యం దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఏడాదిలో శ్రావణ, కార్తీక, మార్గశిర, పుష్య, మాఘ మాసాలతో పాటు శుభ దినాలు, ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు నదీ తీరాన గల ఆలయాలతో పాటు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలను సందర్శిస్తారు. కొందరు భక్తులు గంగమ్మ మొక్కులు, తెప్పె మొక్కులు, కేశ ఖండనాలు జరిపి నది వద్దనే కోళ్లు, మేకలు కోసి వంటలు చేసుకుని భోజనం చేసి తిరిగి వెళుతుంటారు. ఇటీవల కాలంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల ధర్మపురి వద్ద గోదావరి నది నిండు కుండలా మారింది.

● అపరిశుభ్రంగా మారిన నది

ధర్మపురి గోదావరి నది వద్ద కుక్కలు, కోతులు, పందులు సంచరించడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నిత్యం భక్తులు స్నానాలు చేసిన అనంతరం స్నానఘట్టాల పైన ప్రత్యేక పూజలు చేస్తుంటారు. భక్తులు కొబ్బరి ముక్కలు, ప్లాస్టిక్ కవర్లు, అగర్‌బత్తీల ప్యాకెట్లు, ఖాళీ సీసాలు, దుస్తులు అక్కడే వదిలి వేయడంతో కుక్కలు, పందులు పీక్కుతినడం వల్ల అపరిశుభ్రంగా మారుతోంది. అలాగే భక్తులు వంటలు చేసుకుని వాటికి వాడే కాలిపోయిన కట్టెలు, ఇంగిలి విస్తర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, పిండ ప్రదానం కోసం వాడిన పదార్థాలు, పాత దుస్తులు, దీక్షా వస్త్రాలు, దేవుళ్ల ఫొటోలను కూడా అక్కడే వదిలి వెళ్తున్నారు. భక్తులు మున్సిపాలిటీ పక్షాన ఏర్పాటు చేసిన చెత్త కుండీలను సక్రమంగా వాడటం లేదు. నదీ ప్రాంతంలో చెత్తా చెదారాన్ని తొలగించేందుకు పారిశుధ్య సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో సరిపోవటం లేదు. నదీ తీరాన సమీపంలో గల మూత్రశాలలు భక్తులు వినియోగించుకోవడం లేదు. ఖాళీ ప్రదేశాల్లోనే మల, మూత్ర విసర్జన చేయడంతో దుర్గంధంగా మారుతోంది. అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

● గోదావరిలో కలుస్తున్న మురికి నీరు

గోదావరి నదిలో మురికి కాలువల ద్వారా నీరు కలుస్తోంది. ధర్మపురిలోని వివిధ వీధులకు చెందిన మురికి కాలువల ద్వారా వచ్చే నీరు నదిలో కలవడం వల్ల పూర్తిగా కలుషితమం అవుతోంది. కర్ని అక్కపల్లి కల్యాణ మంటపం, సాయిబాబా గుడి పక్కల నుంచి వచ్చే మురికి నీరుతో పాటు బోయవాడ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురికి నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో స్నానఘట్టాలను ఆనుకుని ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రవాహం లేక పూర్తిగా దుర్గంధంగా మారింది. భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. స్నానఘట్టాల వద్ద స్నానాలు చేయడం వల్ల ఆ పరిసర ప్రాంతాలు బురదగా మారి మెట్ల పైన పాకురు పట్టి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం పారిశుధ్య సిబ్బందిని అధికంగా నియమించి, సక్రమంగా నిర్వహణ చేస్తే కొంత వరకు సమస్య తొలగి పోయే అవకాశం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.


స్నానఘట్టం సమీపంలో చెత్తా చెదారం

గోదావరి నది వద్ద అపరిశుభ్ర వాతావరణం



- ముప్పారపు శేఖర్, భక్తుడు, మల్యాల

గోదావరి నది మెట్ల పైన కుక్కలు, కోతులు, పందులు సంచరించడం వల్ల పూర్తిగా దుర్గంధంగా మారింది. గతంలో నది స్నానం కోసం వస్తే మెట్లు ఎంతో శుభ్రంగా అగుపించాయి. భక్తులు తిని, తాగి పడేసిన వాటితో చెత్తా చెదారం పేరుకుపోయింది. గోదావరి అపరిశుభ్రంగా ఉండడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

నది స్నానం చేయలేకపోతున్నాం

- మామిడిపెల్లి మౌనిక, భక్తురాలు, జగిత్యాల



గోదావరి నదిలో స్నానం చేయాలంటే బాధ అనిపిస్తుంది. స్నానఘట్టాల పైన ఎక్క డ చూసినా చెత్త పేరుకుపోయి ఉంది. ఎం తో దూరం నుంచి నమ్మకంతో వచ్చి భక్తులు స్నానాలు చేస్తుంటారు. కాబట్టి పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం కారణంగా తెలుస్తోంది.

చెత్తా చెదారాన్ని తొలగిస్తాం..

- కందుకూరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

ధర్మపురి గోదావరి నది వద్ద చెత్తా చెదారాన్ని తొలగించడం కోసం మున్సిపాలిటీ పక్షాన పారిశుధ్య సిబ్బందిని నియమించాం. భక్తులు అధికంగా వచ్చిన సమయంలో సిబ్బందిని కూడా ఎక్కువగా నియమించి పనులు చేయిస్తున్నాం. మున్సిపాలిటీ పక్షాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చెత్తా చెదారాన్ని తొలగించి ట్రాక్టర్ ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తున్నాం.

నూతన విద్యావిధానం రద్దు కోసం ఉద్యమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జాతీయ నూతన విద్యా విధానం రద్దును విద్యార్థులు వ్యతిరేకించాలనాన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల స్వామి

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రం తెలంగాణ చౌక్‌లో ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్య మకారులు దివంగత గద్దర్ విగ్రహం ఏర్పా టు చేయాలని గద్దర్ గళం రాష్ట్ర ఉపాధ్య క్షుడు, గద్దర్ విగ్రహ కమిటీ చైర్మన్ గజ్జెల స్వామి డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కళాకారులు, రచయి తలు, అభిమానులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజాయుద్ధ నౌకగా పేరొంది, అనునిత్యం తన ఆట పాటల ద్వారా ప్రజల పక్షాన పోరాడిన గద్దర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల న్నారు. గద్దర్ విగ్రహ ఏర్పాటులో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. ఈసంద ర్భంగా వివిధ అంశాలపై సదస్సులో చర్చించారు. ముఖ్య సలహాదారు కొరివి వేణుగోపాల్, న్యాయవాది పూరెళ్ల రాములు, విగ్రహ కమిటీ కన్వీనర్ మేడి అంజన్న, కోకన్వీనర్లు మసాల స్వామన్న, తగరం శంకర్‌లాల్, జాదవ్, పెరుక రాజన్న, పెద్దపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బొల్లం మల్లేశం, కోఇన్‌చార్జి ఏట రవి, ఆసం తిరుపతి, గుల్ల రాజు, తదితులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా రాజన్న ఆలయం


భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజ రాజేశ్వరస్వామిని దర్శించు కున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లింప ునకు సుమారుగా రెండుగంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో భక్త లు పూజలు చేశారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో శ్రీకాంత్ ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● మండల శివదీక్షలు ప్రారంభం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మండల శివదీక్షలు ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయంలోని అభిషేక మండలంలో ఉదయం తెల్లవారు జామున అర్చకులు నందగిరి భాను శర్మ, శంకరయ్య శర్మ, వాసాల మరి గోపి, తమ్మల భీమన్న శివదీక్షాపరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాలాధారణ చేశారు. గురుస్వాములు, మచ్చకిషన్, రాపెల్లి శ్రీధర్, గుంటి కనుకయ్య, ఉప్పల రవి, మ్యాన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● అన్నదానం.. మహాదానం

అన్నదానం మహాదానమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని పార్వతి రాజరాజేశ్వర శివదీక్ష సేవా సమితి ట్రస్ట్ అదనపు భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల నిమిత్తం అదనపు భవనం నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కనికరపు రాకేష్ ఉన్నారు.

కిలిమంజారో పర్వతాధిరోహణ

● రెండోసారి ఘనత సాధించిన ఎక్సైజ్ కానిస్టేబుల్



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి (బ్లూ జెర్కిన్)

కరీంనగర్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి జనవరి 16న ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన పర్వతాన్ని అధిరోహించాడు. మహిపాల్‌రెడ్డి ఇదివరకే 2019లో ఈ శిఖరాన్ని అధిరోహించాడు. మౌంట్ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మహిపాల్‌రెడ్డి అక్కడ సే నోటు డ్రగ్స్ అనే బ్యానర్‌ని ఆవిష్కరించాడు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సే నో టు డ్రగ్స్ అనే కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలకు మత్తు పదార్థాలకు బానిస కావద్దు అని నచ్చిన రంగంలో కృషి చేసి రాష్ట్ర, దేశ పేరు ప్రతిష్టలను పెంచాలని మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. రెండవసారి మౌంట్ కిలిమంజారోని అధిరోహించిన తొలి తెలంగాణ వ్యక్తిగా గుర్తింపు పొందారు. శిఖర అధిరోహణకు సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిపార్టుమెంట్‌కు మహిపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శనివారం నుంచి త్యాగరాజస్వామి ఆరాదనోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఉదయం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, 7.25 గంటలకు నగర సంకీర్తన అనంతరం 9 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు రాజన్న ఆలయం ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో సభ వేదిక సిద్ధం చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎస్.నర్సయ్య త్యాగరాజస్వామి జీవిత విశేషాలను, 10.30 గంటలకు శ్రీవిద్య బృందం పంచరత్న గానం, సాయంత్రం 4.30 గంటలకు కృష్ణవేణి సంగీత కచేరి, 5.30 గంటలకు అబిరాం ఆధ్వర్యంలో వైలన్ సోలో కచేరి, 6.30 గంటలకు ప్రియ సిస్టర్స్ శాస్త్రీయ సంగీత కచేరి, రాత్రి 8 గంటలకు భోగ ధర్మరాజు బృందం కూచిపూడి నృత్యం, 9 గంటలకు జయంతి భాగవతారణి హరికథ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.


రాజన్న ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదిక

ఆకట్టుకున్న తెప్పల పోటీలు


తెప్పల పోటీలకు సిద్ధంగా ఉన్న క్రీడాకారులు

● ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

వేములవాడ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరంలో మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తెప్పల పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది గ్రామాల నుంచి క్రీడాకారులు పోటీపడ్డారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో కిలోమీటరు దూరంలో లక్ష్యాన్ని నిర్దేశించారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో పోటీలు నిర్వహించడంతో వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన తునికి రఘు మొదటి స్థానంలో, నాంపల్లికి చెందిన కూన కుమార్ ద్వితీయ, రుద్రవరం గ్రామానికి చెందిన పండుగ వంశీ తృతీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకుడు తునికి నరేష్ తెలిపారు. విజేతలకు మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతి అందజేసినట్లు చెప్పారు.


తెప్పల పోటీలను వీక్షించేందుకు తరలివచ్చిన జనం


తెప్పల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

1057 మహిళా సంఘాలకు రూ.36.54 కోట్ల రుణాలు..

- గీత, ఐకేపీ ఏపీఎం, సుల్తానాబాద్



ఆంధ్రజ్యోతి : సుల్తానాబాద్ మండలంలో ఎన్ని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్‌లు ఉన్నాయి?

ఏపీఎం : మండలంలో ప్రస్తుతం 1057 మహిళా గ్రూప్‌లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : మహిళ గ్రూపులకు ఎన్ని కోట్ల రుణాలు అందించారు.

ఏపీఎం : ఇప్పటి వరకు 1057 మహిళా గ్రూపులకు ఈ ఏడాది 411 సంఘాలకు 36కోట్ల 54లక్షల రూపాయల బ్యాంకు రుణాలు అందించాం.

ఆంధ్రజ్యోతి : ఎంత మహిళలకు ఉపాధి, ఆర్థిక చేయూత లభించింది?

ఏపీఎం : 245 మంది మహిళలకు వివిధ వ్యాపారాలు, ఎంటర్‌ప్రైజెస్ పెట్టించాం. అలాగే పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో పలువురికి పిండిగిర్నీలు గ్రౌండింగ్ చేయించాం.

- సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

కుట్టు మిషన్ అందజేత

పెద్దపల్లిటౌన్, జనవరి 17: (ఆంధ్రజ్యోతి) విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద మహిళలకు ఉపాధి కోసం చేయూత అందిస్తున్నారు. ఈ సందర్భంగా బంధంపల్లికి చెందిన నిరుపేద మహిళ కుక్క లలితకు కుట్టు మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడూరి శ్రీమాన్, బూతగడ్డ సంపత్, తూముల మహేష్, శ్రావణ్, తుమ్మల సుభాష్, భూతగడ్డ శ్రీనివాస్, శనిగరపు స్వరూప, కుక్క రమ్య, అహ్మద్ రజా పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కళ్యాణ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మరణించిన జర్నలిస్టు సిరిశెట్టి చిరంజీవి కుటుంబాన్ని శుక్రవారం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. చౌరస్తాలోని ఆయన నివాసానికి వెళ్లి చిరంజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంట బీఆర్ఎస్ నాయకులు గాదం నందు, ప్రెస్‌క్లబ్ సభ్యులు ఉన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

ధర్మారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండల విద్యాధికారిగా పోతు ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. పెర్కపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రభాకర్ 2023 సెప్టెంబర్ 25 నుంచి మండల నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంతకుముందు ధర్మారం విద్యాధికారిగా పనిచేసిన పినమళ్ల చాయదేవి గతనెల 31న, పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ప్రభాకర్‌కు ప్రభాకర్‌ను ఎంఈఓగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారిచేశారు.

22,23 తేదీల్లో గ్రామసభలు

ముత్తారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో ఈనెల 22,23న గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న దర్యాపూర్, లక్కారం, ఒడెడ్, సీతంపేట, 23న అడవి శ్రీరాంపూర్, హరిపురం, ఇప్పలపల్లి, కేశనపల్లి, ఖమ్మంపల్లి, మచ్చుపేట, ముత్తారం, మైదంబండ, పారుపెల్లి, పొతారం, జిల్లాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభల్లో ప్రభుత్వ పథకాల అమలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఆమోదానికి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులు జరిగేదెలా..?


జూలపల్లిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సబ్‌డివిజన్ కార్యాలయం

- అలంకారప్రాయంగా పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం
- కానరాని అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

జూలపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కానరావడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల సౌలభ్యం కోసం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం సబ్‌డివిజన్ కార్యాలయాన్ని మండలానికి మంజూరుచేయగా ప్రజలు సంతోషించారు. 2023 సెప్టెంబరు 12న అప్పటి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ తర్వాత కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడంతో కార్యాలయంలో పనులు జరగక కొద్దిరోజులకే మూతపడింది. తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జూలపల్లి సబ్‌డివిజన్ కార్యాలయంలో ఎట్టకేలకు పనులు నిర్వహించేలా తగిన చర్యలు చేపట్టినప్పటికి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కార్యాలయానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. అధికార కార్యక్రమాలకు కంటితుడుపుగా హాజరవుతున్నా సంబంధిత పంచాయతీరాజ్ విభాగం అధికారులు డీఈ, ఏఈలు మిగతా పనిదినాల్లో మండలం వైపు కన్నెత్తి చూడడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా..

- పద్మజ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి



పంచాయతీరాజ్ విభాగం మండల ఏఈ సక్రమంగా విధులకు హాజరు కాక, కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పనులు ముందుకు సాగడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా అతడిలో మార్పు రావడం లేదు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతా.

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకే అందాలి..

- అదనపు కలెక్టర్ వేణు

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల లబ్ధిదారులలో పక్కాగా అర్హులైన వారే ఉండాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. మండలంలోని నర్సయ్యపల్లి, గర్రెపల్లి తదితర గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటించి ఆయా కొత్త పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కానీ, భూమిలేని వ్యవసాయ కూలీల ఎంపిక కానీ, రేషన్‌కార్డుల మంజూరీలో కానీ సర్వే పారదర్శకంగా ఉండాలని, ఏ ఒక్క అనర్హున్ని ఎంపిక చేయవద్దన్నారు. ఏ ఒక్క అర్హుడిని వదిలిపెట్టవద్దని అధికారులకు సూచించారు. సాగుకు యోగ్యంగా లేని వ్యవసాయ భూములను బ్లాక్ చేయాలని అన్నారు. అనంతరం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా అమలుచేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, వంటి పథకాల అర్హుల జాబితా వివరాలను శనివారం వరకు పూర్తి అయి అన్ని గ్రామపంచాయతీలలో జాబితాలను ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపడుతున్న రేషన్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపల్లి, హన్మంతునిపేట గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రేషన్ కార్డులు లేనివారి వివరాలు మండల పరిషత్ కార్యాలయాలకు రావడంతో గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వెంట పంచాయతీ కార్యదర్శులు అశోక్, సోనియా పాల్గొన్నారు.


గర్రెపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

● ఓదెల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తిలో శుక్రవారం వివిధ శాఖలకు చెందిన అధికారులు వ్యవసాయ సాగుకు యోగ్యత లేని భూములను సర్వే నిర్వహించారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న మేరకు ఆ దిశలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.అలాగే ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు పూర్తిచేసిన మేరకు అర్హులను మాత్రమే పరిగణించనున్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో పథకాల అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదికలను అందజేస్తామని వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న నాలుగు పథకాల్లో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడు కూడా తప్పిపోకుండా జాగ్రత్త పడాలని అధికారులు కోరారు. అలాగే గ్రామాల్లో అనర్హులు లబ్ధి పొందకుండా సర్వే చేయాలని కోరారు. ఈ మేరకు గ్రామాల్లో వ్యవసాయ యోగ్యం కానీ భూమిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈనెల21 నుంచి 23 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో పథకాల అర్హుల జాబితాను(నివేదికలను) ప్రభుత్వానికి అందజేసే సమయంలో వివరాలన్నీ పొందుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, వ్యవసాయ అధికారి భాస్కర్, ఎంపీడీవో తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల సర్వేను ఉద్యోగులందరు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎండి.వకీల్, ఎంపీడీవో రామ్మోహనచారిలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వే వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం నూతనంగా చేపడు తున్న పథకాల ఎంపిక ప్రక్రియ అన్ని గ్రామాల్లో పూర్తి కావాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. శనివారం ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతు భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల లబ్ధిదారుల జాబితా వివరాలు ప్రదర్శించాలని సూచించారు. వారివెంట డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, ఎంపీవో కిరణ్, ఆర్ఐ రాజేందర్, అజీమ్, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాగుచేస్తున్న భూములకు మాత్రమే రైతుభరోసా అందించాలనే ఆలోచనతో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. వ్యవసాయ యోగ్యంకాని భూములు, ఇంటిస్థలాలు, గుట్టలు, పడావు భూముల సర్వేను అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న గ్రామాల్లోని రైతుల ఇళ్లకు వెళ్లి భూములకు సమాచారాన్ని రాబట్టేందుకు కృషి చేస్తున్నారు.

ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డులు

(5వ పేజీ తరువాయి)

డేటాను మండలాల వారీగా సం బంధిత అధికారులకు పంపించారు. ఆ డేటా ప్రకారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ కార్డు జారీ చేసేందుకు అర్హత కలిగి ఉన్నారా, లేదా అని పరిశీలన చేస్తున్నారు. అర్హులైన వారి జాబితాలను ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. గ్రామ, వార్డు సభల ఆమోదం మేరకు కార్డులు మంజూరు చేయనున్నారు. 26వ తేదీ నుంచి లబ్ధిదారులకు కార్డులను జారీ చేయనున్నారు. జిల్లాలో 2,07,231 ఆహార భద్రతా కార్డులు, 12,290 అంత్యోదయ ఆహార భద్రత కార్డులు, 156 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల జారీ కోసం మండల స్థాయిలో ఎంపీడీవో, మున్సిపాలిటీల్లో మున్సి పల్ కమిషనర్ బాధ్యత వహించనున్నారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పర్యవేక్షకులుగా వ్యవహరిస్తున్నారు. అర్హులను గుర్తించిన తర్వాత ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డు సభల్లో ప్రదర్శించి, చదివి వినిపించి, చర్చించిన తర్వాత ఆమోదిస్తారు. అర్హత కలిగిన వ్యక్తికి ఒకే ఒక్క ఆహార భద్రత(రేషన్) కార్డు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే చేర్పులు, మార్పులకు కూడా అవకాశం కల్పించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, ఏఎంసీ సభ్యులు కరుణాకర్, మహేందర్, కొమురయ్య, శ్రీనివాస్, రాజేశం, గౌసు భయ్యా సర్‌ఉత్తమ్‌రెడ్డి, నూగిళ్ళ మల్లయ్య, కౌన్సిలర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు గోపగాని సారయ్యగౌడ్, దొడ్డ శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యంగా ఉండి సేవాభావంతో పనిచేయాలన్నారు. సమాజసేవలో పద్మశాలి ఉద్యోగులు ముందుండాలని, పేదలకు అండగా ఉండే కార్యక్రమాలతో అందరిమన్నలను పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు బొద్దుల గంగయ్య, కొలిపాక సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం, సలహాదారుడు డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుందారపు నరేష్‌తో పాటు ఎనగందుల రాజప్రసాద్, చింతకింది రమేష్, స్వరూపరాణి, పల్లెర్ల కుమారస్వామి, ఆడెపు శ్రీనివాస్, ఒడ్నాల రజిత, బొమ్మ మమత తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు,ఉపాధ్యాయులు

పాలకుర్తి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాల తక్కళ్ళపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1998-99 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ ఒక చోట కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆడిపాడారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం కలుసుకొని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పటిష్ఠ పర్చాలి


కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, కార్పొరేషన్‌ను సుందరీకరణగా చూడాలని అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్ జే అరుణశ్రీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థలో పలు ప్రాంతాల్లో ఆమె పారిశుధ్య నిర్వహణపై తనిఖీ నిర్వహించారు. గౌతమినగర్‌లోని కంపోస్టు యార్డు, డ్రై రీసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. విఠల్‌నగర్‌లో ప్రమాదంగా మారిన కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా డంపుయార్డ్‌కు తరలించాలని, విఠల్‌నగర్‌లో ప్రమాదకరంగా మారిన వంతెన పనులను యుద్ధ ప్రాతిపదిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంట ఈఈ రామన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సునీల్‌రాథోడ్, మధుకర్ ఉన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని కూరగాయల మార్కెట్లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే పేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు కూడా పంపిణీ చేశారు. ఇతర మెరుగైన దంత సమస్యలపై అపరేషన్ల కోసం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌ల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేశారు.

ఈ కార్యక్రమంలో డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాల సాని మణిదీప్, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు దెశెట్టి రవీందర్, కామ సంజీవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ గరిగె విశ్వనాథం, అమ్ముల మంజుల, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమణరావు పంపిణీచేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30మందికి రూ. 30,03,480 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, తహసీల్దార్ బషీరోద్దీన్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరీఫ్, నాయకులు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కాసార్ల మహేందర్, కోరుకంటి వెంకటేశ్వర్ రావు, గోపు లక్ష్మారెడ్డి, రనహరి సుధాకర్‌రెడ్డి, తాటిపల్లి రమేష్‌బాబు, బూర్ల సత్యం, బాలసాని పర్శరాంగౌడ్, కొండ తిరుపతిగౌడ్, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, కొత్తిరెడ్డి అశోక్‌రెడ్డి, గొల్లె భూమేష్, పర్శరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గాదేవి ఆలయంలో మండల మహోత్సవం


పూజలో పాల్గొన్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో శుక్రవారం దుర్గాదేవి ఆలయంలో మండల మహోత్సవ పూజా కార్యక్రమాలు జరిగాయి. నూతనంగా నిర్మించిన ఆలయ నిర్మాణ పనులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిష్ఠ మహోత్సవ పరిపూర్ణ ఫల సిద్ధి కోసం మండల మహోత్సవ పూజలను నిర్వహించారు. అర్చకులు జగన్నాథాచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా జీఎం బండి వెంకటయ్య పాల్గొన్నారు. ప్రాజెక్టు రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ప్రగతి సాధించాలని, ఉద్యోగులు క్షేమంగా ఉండాలని జీఎం ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జీఎం రెస్క్యూ శ్రీనివాసరెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత


నియామక ఉత్తర్వులు అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల 10మంది డిపెండెంట్‌లకు శుక్రవారం కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, అధికారులు రఘుపతి, సుదర్శనం, సునీల్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్జీ-3లో ఉద్యోగుల క్వార్టర్స్ కౌన్సెలింగ్

సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలోని క్వార్టర్స్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం చేపట్టారు. సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన క్వార్టర్స్ కౌన్సెలింగ్ కార్యక్రమంలో మొత్తం 175 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్లకు 61 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 26 మంది ఉద్యోగులు హాజరయ్యారు. అందులో 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అధికారులు సుదర్శనం, రాజేంద్రకుమార్, ఐలయ్య, గుర్రం శ్రీహరి, సిబ్బంది మహేందర్‌తో పాటు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 సెక్యూరిటీ రూంను ప్రారంభించిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టు ప్రధాన ద్వారం వద్ద నూతనంగా నిర్మించిన సెక్యూరిటీగార్డు రూంను శుక్రవారం జీఎం బండి వెంకటయ్య ప్రారంభించారు. సెక్యూరిటీ సిబ్బంది అవసరానికి సరిపడా అన్ని వసతులతో గదిని నిర్మించినట్టు జీఎం తెలిపారు. విధి నిర్వహణలో సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా ఉండాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, ప్రాజెక్టుమేనేజర్ పాండే, సేఫ్టీ ఆఫీసర్ పాపయ్య, ఎస్ఎస్‌వో మమమ్మద్ షరీఫ్, అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ శ్యాంసన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, జమెదార్ వెంకటేశ్వర్లుతో పాటు ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది, ప్రైవేట్ గార్డులు పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పల్లెలో కంటి వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లెలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 67 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న 27 మందికి రేకుర్తి ఆసుపత్రిలో ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ మాజీ సర్పంచ్ బుర్ర శశికళ ముత్యాలు గౌడ్, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ బోర్డు సమావేశంలో
కార్మికుల సమస్యలపై బీఎంఎస్ చర్చ


సమావేశంలో పాల్గొన్న అధికారులు, బీఎంఎస్ నాయకులు

గోదావరిఖని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సీఎంపీఎఫ్ బోర్డు సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గు కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. పీపీవో సవరణకు సంబంధించిన అన్ని కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. సీఎంపీఎఫ్‌ని పూర్తిగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసి, బోర్డుకు తెలియజేయాలన్నారు. వితంతు పెన్షన్ కేసుల పరిష్కారాన్ని సులభతరం చేయడం ద్వారా, పెండింగ్‌లో ఉన్న అన్ని వితంతు పెన్షన్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. 2024-2025 సంవత్సరానికి వడ్డీ రేటును 7.60 శాతం కంటే తక్కువకు తగ్గించాలనే యాజమాన్యం ప్రతిపాదనపై, సంస్థ వడ్డీ రేటును 7.60శాతం వద్ద మార్చకుండా ఉంచాలని డిమాండ్ చేసింది. పెన్షన్ మొత్తంలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి, రాబోయే కమిటీ సమావేశంలో ప్రత్యేక ఆర్థికనిపుణులను చేర్చడంపై ఈ సమావేశంలో నిర్ధారించినట్టు నాయకులు తెలిపారు. పెన్షన్, పీఎఫ్ కేసుల పరిష్కారానికి కాలపరిమితిని నిర్ణయించడం ద్వారా, సీఎంపీఎఫ్ ఇన్‌స్టిట్యూట్ అనవసరంగా పెండింగ్‌లో ఉంచిన కేసులపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. సవరించిన పెన్షన్ కేసులను పే అగ్రిమెంట్ 11ప్రకారం త్వరగా పరిష్కరించాలన్నారు. బీఎంఎస్ నుంచి సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యులు సభ్యులు కొత్తకాపు లక్ష్మరెడ్డి, ఆశిషమూర్తి పాల్గొన్నారు.